

70శాతం పూర్తయిన పోస్ట్ మెట్రిక్ బాలికల హాస్టల్

# పనుల్లో ప్రగతి

గత వైసీపీ ప్రభుత్వ తొందరపాటు చర్యలు ప్రగతికి ఆటంకాలుగా మారుతున్నాయి. అప్పట్లో ఉర్దూ సముదాయ భవనాల కోసం ఆఘమేఘాల మీద స్థల సేకరణ చేసి శంకుస్థాపనలు చేపట్టారు. అనంతరం పనులు ప్రారంభించారు. బిల్లులు సకాలంలో అందించకపోవడంతో పనులు నిలిచి పోయాయి. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టిసారించింది. ఈనేపథ్యంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. జిల్లాలో ఉర్దూ సముదాయ భవనాల కోసం రూ.9.72 కోట్లను కేటాయింపు చేశారు. అప్పట్లో బిల్లులు అందని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వగా వారు పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. దీంతో పనుల్లో ప్రగతి పుంజుకుంది. సాధ్యమైనంత వరకు ఈ విద్యాసంవత్సరంలోనే భవనాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారు.

- తొలగిన నీలి నీడలు
- ఉర్దూ సముదాయ భవనాలకు రూ.9.72 కోట్లు
- మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రత్యేక చొరవ
- బిల్లుల మంజూరులో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం
- నోటీసులివ్వడంతో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్
- ఉర్దూ కళాశాల, కామన్ సర్వీస్ సెంటర్ పనులు రద్దు

**నంద్యాల ఎడ్యుకేషన్, మే 25 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో ఎన్నో యేళ్ల ఎదురుచూస్తున్న ఉర్దూ సముదాయ భవనాల పనులు ప్రగతి బాట పట్టనున్నాయి. ఈ పనులపై నీలినీడలు తొలుగుతున్నాయి. ఉర్దూ సముదాయ భవనాల కోసం రూ.9.72కోట్లను రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసి నిధులు మంజూరు చేయక చేతులెత్తేయడంతో కాంట్రాక్టర్‌లు ఎక్కడి పనులు అక్కడే వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిపై ప్రత్యేకదృష్టి సారించి బిల్లులు మంజూరు చేయడంతో కాంట్రాక్టర్లు మళ్లీ పనులు ప్రారంభించారు. ఉర్దూ కళాశాల భవనం, కామన్‌సర్వీస్ సెంటర్ పనులు మొదలు కాకపోవడంతో కాంట్రాక్టును రద్దు చేశారు.

### జీవోలు, పేపర్లకే పరిమితం..

2023లో ఎన్నికలకు ముందు ఆర్భాటంగా శంకుస్థాపన చేసి వైసీపీ ప్రభుత్వం వదిలేసింది. ఏపీ విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపట్టేలా 100 పడకలు కలిగిన పోస్ట్‌మెట్రిక్ బాయ్స్ హాస్టల్, పోస్ట్‌మెట్రిక్ బాలికల హాస్టల్, ప్రీమెట్రిక్ బాయ్స్ హాస్టల్, ప్రీమెట్రిక్ బాలికల హాస్టల్, వర్కింగ్ ఉమన్స్ హాస్టల్స్‌కు ఒక్కోదానికి రూ.2,10,84,000లు కేటాయించారు. అందులో కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.1,26,50,000లు, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.84,34,000లు కేటాయించింది. మొత్తం ఐదు భవనాలకు రూ.6,32,52,000లు మంజూరు చేశారు. వీటితో పాటు కామన్ సర్వీస్ సెంటర్‌కు రూ.1.40కోట్లు కేటాయించగా అందులో రూ.84 లక్షలు కేంద్రప్రభుత్వం, రూ.56లక్షలు రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరుచేశారు. అక్కడే ఉర్దూ జూనియర్ కళాశాల నిర్మాణానికి రూ.1,99,45,000లు మంజూరు చేయగా, అందులో రూ.1,19,67,000లు కేంద్రప్రభుత్వం, రూ.79.78లక్షలు రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. కాని ఇదంతా జీవోలకు, పేపర్‌లకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటి పనుల పురోగతి కనిపిస్తోంది.



70శాతం పూర్తయిన వర్కింగ్ ఉమన్స్ హాస్టల్

### నాడు అంతా హడావిడి...

ఉర్దూ సముదాయ భవనాల నిర్మాణాన్ని పట్టణానికి దూరంగా నంద్యాల-వైఎస్‌నగర్ రహదారిలో నాటి వైసీపీ ప్రభుత్వ స్థలం సేకరణ హడావిడి చేపట్టింది. పొలాలకు వెళ్లే రహదారిని చూపించి ఆఘమేఘాల మీద అప్రూవల్ కోసం ఉన్నతాధికారులకు పంపారు. రహదారిని భవన నిర్మాణాలకు ఎలా కేటాయిస్తారంటూ వెనక్కి పంపారు. దీంతో జాప్యం జరిగింది. మళ్లీ రహదారి కన్వర్షన్ చేసి కేబినెట్‌లో ఆమోదం పొందారు. దీంతో ఉర్దూ సముదాయానికి 4.5ఎకరాల భూమిని కేటాయించారు. భూమిని చూపి పనులకు శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రీ మెట్రిక్ బాలుర, బాలికల వసతిగృహాలు

### ఈ విద్యా సంవత్సరమే ప్రారంభించే..

రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చొరవతో 20శాతం కంటే పూర్తయిన భవనాల నిర్మాణాల పనులు మళ్లీ మొదలయ్యాయి. దీంతో ఈ ఏడాది పోస్ట్ మెట్రిక్ బాలికల వసతిగృహం, వర్కింగ్ ఉమన్స్ హాస్టల్ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ప్రస్తుతం 80శాతం పనులు పూర్తయ్యాయి. జూన్ 30వ తేదీలోపు పూర్తిచేసి అప్పగించేలా కాంట్రాక్టర్‌కు గడువును పొడిగించారు. ఈవిద్యాసంవత్సరమే ప్రారంభించే అవకాశాలున్నాయి. బిల్లులు మంజూరు కాకుండా స్లాబ్‌వరకే నిలిచిపోయిన ప్రీ మెట్రిక్ బాలుర హాస్టల్, ప్రీ మెట్రిక్ బాలికల హాస్టల్ పనులను మొదలు పెట్టేందుకు అధికారులు కాంట్రాక్టర్‌కు నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్న కాంట్రాక్టర్ మళ్లీ పనులు మొదలు పెట్టేందుకు ముందుకు వచ్చారు.

### సందిగ్ధంలో ఉర్దూ కళాశాల...

ఉర్దూ కళాశాల భవనాన్ని అక్కడే నిర్మించాల్సి ఉండగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో కాంట్రాక్టును పూర్తిగా రద్దు చేశారు. దీంతో ఉర్దూ కళాశాల భవనాన్ని అక్కడే నిర్మించాలా?, మరోచోట స్థల సేకరణ చేపట్టాలా? అనే సందిగ్ధంలో ఉన్నారు. ఉర్దూ కళాశాలను పట్టణంలోనే నిర్మించాలనే ఉర్దూ సంక్షేమ సంఘాలు పట్టుబట్టడంతో కళాశాల స్థలం కోసం ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మించేందుకు చర్చలు జరుపుతున్నారు.

### త్వరగా పూర్తిచేయాలి



ఉర్దూ భవన సముదాయం కోసం ఎంతో పోరాడి సాధించాం. అసంపూర్తిగా వదిలేసిన భవనాలను కూటమి ప్రభుత్వం త్వరితగతిన పూర్తిచేయాలి. ఉర్దూ కళాశాల, కామన్ సర్వీస్ సెంటర్లను కూడా పూర్తి చేస్తారని ఆశిస్తున్నాం.

- ఎస్ఎండీ అబులైస్, ఆల్‌మేవా అధ్యక్షులు

### ప్రభుత్వం ఆదేశాలతో రద్దు చేశాం.



ఉర్దూకళాశాల, కామన్‌సర్వీస్ సెంటర్ల నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ప్రభుత్వ ఆదేశాలతో రద్దు చేశాం. 50శాతం పనులు చేసి నిలిచిపోయిన పనులకు ఇటీవలే కాంట్రాక్టర్‌కు చివరి నోటీసు ఇచ్చాం. దీంతో కాంట్రాక్టర్ తిరిగి పని ప్రారంభించేందుకు ముందుకు వచ్చారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తిచేస్తాం. నాలుగు విడతలుగా బిల్లులు ఇవ్వడానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

- నాగరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏపీఈడబ్ల్యూఐడీసీ

## మహానాడుకు తరలిరండి: మంత్రి



**నంద్యాల రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి):** ఈనెల 27, 28, 29 వతేదిలలో కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తరలి రావాలని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన పలువురు నాయకులతో కీలక బేటి నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మహానాడుకు తరలివచ్చే నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు రవాణా, వసతి, భద్రతపై ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర సన్నాహాలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త సేవాదృక్పథంతో, అంకితభావంతో మహానాడును విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. పార్టీ నంద్యాల నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకుడు, శాసన మండలి సభ్యుడు పేరాబత్తుల రాజశేఖర్, నంద్యాల పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి పోతురాజు రవికుమార్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా బోటు ప్రయాణం



నెహ్రూనగర్ సమీపంలోని ముర్వకొండ ఘూట్ వద్ద పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఇంజన్ బోటు

**పగిడ్యాల, మే 25 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని నెహ్రూనగర్ సమీపంలోని ముర్వకొండ, అర్లపాడు ఘూట్‌ల నుంచి కృష్ణానదిలో ఇంజన్‌బోటు ప్రయాణాలు యథేచ్ఛగా, ప్రమాదకరంగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి తెలంగాణ రాష్ట్రానికి వెళ్లేందుకు ప్రయాణికులు అధిక సంఖ్యలో తరలివస్తుండటంతో నదీతీర ప్రాతం ప్రయాణికులతో కళకళాడుతోంది. ప్రస్తుతం వివాహాలు, శుభకార్యాలయాలు ఉండటంతో ఇరు రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు నదిలో ఇంజన్‌బోటు ప్రయాణాలను సాగిస్తున్నారు. ప్రతి రోజు ఆయా ఘూట్ల వద్ద వందల సంఖ్యలో నదిలో ప్రయాణాలు చేస్తున్నారు. ఇరు రాష్ట్రల మధ్య రోడ్డు మార్గం ద్వారా ప్రయాణాలు చేసేందుకు అధిక సమయం పట్టడంతో పాటు ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పడవ ప్రయాణంపై ఆధారపడుతున్నారు. బోటు నిర్వాహకులు అనుభవజ్ఞులైన బోటు డ్రైవరులతో పాటు లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాల్సి ఉంది. అయితే ఇవేమీ పాటించడం లేదు. పైగా పరిమితికి మించి ప్రయాణికులను ఇంజన్ బోట్లలో తరలిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు నదీలో నీటిమట్టం పెరుగుతున్నప్పటికీ నదిలో ప్రయాణాలు కొనసాగించడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**నంద్యాల నూనెపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి):** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రజలనుంచి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏదశలో ఉందో సమాచారం తెలుసు కోవడానికి టోల్‌ఫ్రీ నెంబర్ 1100కాల్ సెంటర్‌ను సంప్రదించి తెలుసుకోవచ్చని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యా లయాలు, డివిజన్ స్థాయిలో కూడా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

## మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

### రాఘవేంద్ర స్వామి దర్శనానికి మూడు గంటల సమయం

**మంత్రాలయం, మే 25(ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దేశనలుమూలల నుంచి దర్శనార్థం వచ్చిన భక్తులతో మార్మోగింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు అశేష భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, పోలీసులు, సెక్యూరిటీ ఆధ్వర్యంలో శ్రీమఠం ప్రాంగణంలో క్యూలైన్లు అదనంగా ఏర్పాటు చేశారు. ప్రసాదాల కొరత రాకుండా ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. దర్శనం మూడు గంటలు సమయం పట్టింది. మఠం ప్రాంగణంలో నలుదిక్కులూ పీఠాధిపతి ఆదేశాల మేరకు తొక్కిసలాట జరగకుండా శ్రీమఠం అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.



భక్తులతో రద్దీగా ఉన్న శ్రీమఠం ప్రాంగణం

## ఉద్యోగుల్లో ఉత్కంఠ

- కొందరిలో బదిలీల గుబులు
- ఐదేళ్లు దాటిన వారికి తప్పనిసరి..
- కీలక పోస్టులకు పైరవీలు
- ఎవరి స్థాయిలో వారు ముమ్మర ప్రయత్నాలు



**నంద్యాల, మే 25(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీ చేయడంతో పలు శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉత్కంఠ మొదలైంది. ఇదే క్రమంలో బదిలీల హడావిడి సైతం ఆయా శాఖల్లో లేకపోలేదు. ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారితో పాటు రిక్వెస్ట్ బదిలీలకు అవకాశం కల్పించడం ఆయా ఉద్యోగుల్లో అలజడి రేపుతోంది. ఈ నేపథ్యంలో కొందరు ఉద్యోగులు సైతం సిఫార్సుల కోసం తమదైన శైలిలో పైరవీలు మొదలెట్టారు. దీంతో ఎవర్ని ఎక్కడికి బదిలీ చేస్తారో..? అనే టెన్షన్ నెలకొంది. ప్రధానంగా ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని రెవెన్యూ, వీఆర్, జిల్లా పరిషత్, గ్రామ వార్డు సచివాలయాలు, విద్యుత్, హౌసింగ్, వ్యవసాయ, ఆర్అండ్‌బీ, మార్కెటింగ్ శాఖ, రిజిస్ట్రేషన్, రవాణాశాఖ, కమర్షియల్ ట్యాక్స్, మున్సిపల్ శాఖల ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. ఈ క్రమంలో కొందరైతే తమకు నచ్చిన స్థానాల కోసం ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ కడుతుండటం గమనార్హం. ఏది ఏమైనా ప్రభుత్వ ఉత్తర్వులతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఉద్యోగుల బదిలీ కానున్నారు. ఈ క్రమంలో కొందరు ఉద్యోగుల్లో బదిలీ ఫీవర్ పట్టుకుంటే.. మరికొందరు ఉద్యోగుల్లో మాత్రం తమను ఏ స్థానాలకు బదిలీ చేస్తారో..? అని భయాందోళన మొదలైంది. ప్రధానంగా కొన్ని శాఖల్లో కీలక పోస్టులు ఇన్‌చార్జి పాలనలో సాగుతుండటంతో పాటు అదనపు బాధ్యతలు ఇదివరకే అప్పగించారు. తాజాగా ప్రభుత్వం బదిలీలకు శ్రీకారం చుట్టడంతో ఆయా కీలక పోస్టింగ్‌లకు రెగ్యూలర్ ఉద్యోగులను నియమిస్తారా..? లేక.. ఇతరత్రా కారణాలతో యథావిధిగా ఇన్‌చార్జి అధికారులనే కొనసాగిస్తారా..? అనే సందేహాలు ఆశాఖ వర్గాల్లో లేకపోలేదు. కొన్ని శాఖల్లో కొందరు ఉద్యోగులైతే..

కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది కావస్తున్నా.. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు శ్రీకారం చుట్టకపోవడంతో ఉద్యోగులు ఉత్కంఠగా ఎదురుచూశారు. కొన్ని శాఖల్లో కొందరు ఉద్యోగులైతే.. బదిలీల జీవో కోసం వేచి ఉండలేక.. తమదైన శైలిలలో పైరవీలు చేసి సిఫార్సులతో బదిలీ చేయించుకున్నారనే విషయం తెలిసిందే. ఇక మిగిలిన వారు మాత్రం నిరాశగా ఎదురుచూడాల్సిన దుస్థితి. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీచేయడంతో ఆయా శాఖలవారీగా ఆయా ఉద్యోగుల్లో తమకు ఎలాంటి స్థానం దక్కు తుందోనని ఆసక్తి నెలకొంది.

మిగతా 7వ పేజీలో

## లక్ష్యం నెరవేరేనా?

- గడువు ముగుస్తున్న పూర్తి కాని పంటకుంటలు
- జిల్లాకు మంజూరైనవి 3117- పూర్తయినవి 888

**జూపాడుబంగ్లా, మే 25 (ఆంధ్రజ్యోతి):** మెట్ట ప్రాంతాల్లోని రైతుల పొలాల్లో పంటకుంటలు తవ్వి జల సంరక్షణ చర్యలు చేపట్టి భూగర్భజలాలు పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. యంత్రాలతో కాకుండా ఉపాధి కూలీలకు పని కల్పించడం, రైతులకు పైసా ఖర్చు లేకుండా పంట కుంటలు తవ్వించడం వంటి ప్రయోజనకర పనులు చేపట్టడం హర్షించదగ్గ విషయమని పలువురు కొనియాడుతున్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో చేపట్టిన అధికారులు నిర్లక్ష్యంతో గడువు ముగుస్తున్న పంటకుంటలు మాత్రం పూర్తికావడం లేదు. జాతీయ ఉపాధిహామీ కింద రైతులు తమ పొలాల్లో పంట కుంటలు ఏర్పాటు చేయించుకుంటే భూగర్భజలాలు పెరగడమే కాకుండా స్వల్ప, దీర్ఘకాలిక ఉద్యానపంటలు సాగు చేసుకుంటారని ప్రభుత్వం చెప్పిన కూడా అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదని తెలుస్తోంది. రైతులు తమ పొలాల్లో విస్తీర్ణం బట్టి స్థలాన్ని చూపిస్తే ఉపాధి కూలీలు పంటకుంటలు తవ్విస్తారు. అయితే పంటకుంటలు తవ్వించుకున్న తర్వాత ఉద్యానపంటలు సాగుచేసుకోవచ్చని రైతులకు ఉద్యానవన శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉండగా ఆదిశగా సదస్సులు కనిపించడం లేదు. చివరికి రైతులకు పంటకుంటలు, ఉద్యానపంటలు సాగు కలగా మారనుంది. ఖరీఫ్ 20 రోజుల్లో ప్రారంభం కానుంది. మరీ రైతుల కళ్లలో ఆనందం కనిపించడంలేదు.



తంగడంచలో పంటకుంటను తవ్వుతున్న ఉపాధి కూలీలు (ఫైల్)

- నంద్యాల జిల్లాలో మొత్తం 490 గ్రామపంచాయతీలకు సంబంధించి 3117 పంటకుంటలు మంజూరు కాగా మే చివరి నాటికి 2500 పూర్తిచేయాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే ఇప్పటివరకు 888 పూర్తయినట్లు, 1628 పంటకుంటలు వివిధ దశల్లో పనులు జరుగుతున్నట్లు గణంకాలు తెలుపుతున్నాయి. కేవలం జిల్లా మొత్తం 35శాతం మాత్రమే పూర్తయినట్లు తెలుస్తోంది.
- నందికొట్కూరు నియోజకవర్గంలోని వివిధ మండలాలను పరిశీలిస్తే... పంటకుంటల ఏర్పాటు ముందుకు సాగడంలేదని తెలుస్తోంది. జూపాడుబంగ్లా మండలానికి 44మంజూరుకాగా 19 పూర్తి అయ్యాయి. కొత్తపల్లి మండలానికి 100 మంజూరుకాగా 30, మిడుతూరు మండలానికి 81మంజూరు కాగా 26, నందికొట్కూరు మండలానికి 90మంజూరు కాగా 32, పగిడ్యాల మండలానికి 24 మంజూరుకాగా 11, పాములపాడు మండలానికి 73 మంజూరు కాగా కేవలం 15 పూర్తి అయినట్లు తెలుస్తోంది.



### పైసా ఖర్చు లేకుండా పంటకుంట ఏర్పాటు



పైసా ఖర్చు లేకుండా పంటకుంట ఏర్పాటు చేసుకునేందుకు ఉపాధి కార్మికులతో తవ్విస్తోంది. కుంటల్లో వర్షపు నీటినిల్వతో బోరుబావుల్లో భూగర్భజలాలు పెరుగుతాయి. ప్రభుత్వం నీటికుంటలతోపాటు ఉద్యానపంటల సాగుకు కూడా ప్రోత్సాహం అందించడం సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరైతు నీటికుంటలు తవ్వించుకుంటే ప్రయోజనాలు పొందవచ్చు.

- మహేశ్, రైతు, మండ్లెం

### లక్ష్యాన్ని అధిగమిస్తాం

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం వర్షాలు పడి మట్టి మెత్తగా ఉంటుందని, ఉపాధి కార్మికులకు ఇబ్బందిగా ఉండదు. నెలాఖరుకు 2500 పంటకుంటలు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకున్నాం. రైతులకు ఖరీఫ్ ప్రారంభం అయ్యేలోపు పంటకుంటలు పూర్తిచేసి భూగర్భజలాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

- అన్వారాబేగం, ఏపీడీ

## వైభవంగా పల్లకీ సేవ



పూజలు చేస్తున్న ఈవో దంపతులు

**శ్రీశైలం(ఆత్మకూరు), మే 25 (ఆంధ్రజ్యోతి):** శ్రీశైల క్షేత్రంలో ఆదివారాన్ని పురస్కరించుకుని మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ప్రతి ఆదివారం, పౌర్ణమి, మూలా నక్షత్రం సందర్భంగా దేవస్థానం తరుపున ఈ సేవను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించారు. ఆ తర్వాత మహాగణపతిపూజ అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకి వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలను నిర్వహించారు. ఈ పూజల్లో దేవస్థానం ఈవో శ్రీనివాసరావు దంపతులు ఉన్నారు.

# ఉద్యోగుల్లో ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

మొత్తంగా తమకు బదిలీ రానుందనే విషయం మాత్రం ఆయా ఉద్యోగులకు స్పష్టత వచ్చినట్లైంది.

**త్వరలో ఉత్కంఠకు తెర..**

ప్రభుత్వ బదిలీ ఉత్తర్వులు ప్రకారం జూన్ 3వ తేదీ లోపు ఉత్కంఠకు తెరపడనుంది. ఇప్పటికే ఆయా శాఖల ఉన్నతాధికారులకు ప్రభుత్వం తమదైన పరంగా ఆదేశాలు జారీ చేసింది. తగిన జాబితా కూడా సిద్ధమైనట్లు ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. జూన్ 2వ తేదీ లోపు బదిలీ ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంది. ఈనేపథ్యంలో కొందరు ఉద్యోగులు సైతం ప్రజాప్రతినిధుల వద్దకు సిఫార్సుల కోసం ప్రదక్షిణలు చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా.. గత వైసీపీ ప్రభుత్వంలో సానుకూలంగా ఉన్న అధికారులకు మాత్రం బదిలీ ఫీవర్ పట్టుకుంది. తమను దూర ప్రాంతాలకు బదిలీ చేస్తారేమో? అనే ఆందోళన మొదలైంది. దీంతో సదరు ఉద్యోగులు కూడా కూటమి నాయకుల వద్దకు క్యూ కట్టారని సమాచారం. ఇదే తరహాలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సైతం ఎక్కువ సంఖ్యలో బదిలీ కానున్నట్లు సమాచారం.

# వ్యవసాయశాఖలో పైరవీలు

- ఎమ్మెల్యే, మంత్రుల ఇళ్లకు క్యూ
- రూ.10లక్షల నుంచి రూ.20లక్షల డిమాండ్
- నేడు బదిలీల కౌన్సెలింగ్
- అనంతపురం తరలివెళ్లిన వ్యవసాయాధికారులు

కర్నూలు అగ్రికల్చర్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ శాఖలో చేపడుతున్న బదిలీల్లో పైరవీలు కొనసాగుతున్నాయి. ఐదేళ్లు పూర్తిచేసుకున్న మండల వ్యవసాయాధికారులతో పాటు ఏడీఏలు ఎలాగైనా మంచి స్థానాన్ని దక్కించుకోవాలని రెండు రోజులుగా రాజకీయ నాయకులు, రాష్ట్ర ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్యమైన స్థానాల కోసం ఎంత మొత్తమైన నాయకులకు చెల్లించేందుకు సిద్ధమయ్యారు. తమకు తెలిసిన చోటా మోటా నాయకుల ద్వారా మంత్రులు, ఎమ్మెల్యేలను కలిశారు. ఉమ్మడి జిల్లాలోని మండల వ్యవసాయాధికారులు, ఏడీఏలు, సూపరింటెండెంట్లు దాదాపు 150 మంది కోరుకున్న చోటుకు బదిలీ చేయించుకునేందుకు కౌన్సెలింగ్ కోసం అనంపురం బయలుదేరి వెళ్లారు.

**రాయలసీమ జోన్ పరిధిలోని..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, నంద్యాల, ఆదోని, డోన్, బనగానపల్లె, పత్తికొండ నియోజకవర్గాల్లోని మండల వ్యవసాయాధికారుల పోస్టింగుల కోసం నాయకుల వద్ద క్యూ కట్టారు. రాయలసీమ జోన్ పరిధిలోని ఉమ్మడి కర్నూలు జిల్లా కడప, అనంతపురం, జిల్లాలో పని చేసే మండల వ్యవసాయాధికారులు, ఏడీఏల బదిలీ ప్రక్రియ సోమవారం అనంతపురంలోని వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయంలో జరిగేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో పని చేసే అసిస్టెంట్ డైరెక్టర్ కృపానందం బదిలీ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు చేపట్టేందుకు పర్యవేక్షించనున్నారు. ఉమ్మడి జిల్లాలో కాసులు కురిపించే నియోజకవర్గ కేంద్రాలు, మండల వ్యవసాయాధికారుల కార్యాలయాలకు బదిలీ చేయించుకునేందుకు వారం రోజులుగా రాజకీయ అధికార పార్టీ నాయకుల ఇళ్ల వద్ద వ్యవసాయాధికారుల రాకపోకలతో హడావుడి ఎక్కువైంది. కొంత మంది నాయకులు కోరుకున్న చోటకు బదిలీ చేయిస్తామని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల దాకా వ్యవసాయాధికారుల వద్ద పంచాయితీ పెట్టినట్లు సమాచారం. పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చుకున్నా ఏడాది తిరిగేసరికల్లా ఆ డబ్బును రాబట్టుకోవచ్చని డీలర్ల నుంచి ముక్కుపిండి వసూలు చేయవచ్చని కొంత మంది మండల వ్యవసాయాధికారులు, ఏడీఏలు ధీమాతో ఉన్నారు.




కల్లూరు మండల వ్యవసాయ కార్యాలయం

# పిల్లల్లో సాహిత్యాభిరుచి పెంచాలి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ


- ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు కూడా అవసరం
- ప్రాంతీయ చరిత్ర, సంస్కృతిపై అధ్యయనాలు జరగాలి
- ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, సాహితీవేత్త తెలకపల్లి రవి

కర్నూలు కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సంస్కృతిని పరిరక్షించుకోవాలంటే పిల్లల్లో సాహిత్యంపై అభిరుచి పెంచాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, సాహితీవేత్త తెలకపల్లి రవి అభిప్రాయపడ్డారు. శనివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రానికి విచ్చేసిన ఆయనతో 'ఆంధ్రజ్యోతి' కలిసినప్పుడు పలు విషయాలపై ఆయన స్పందించారు. పలు సాహిత్య సామాజిక అంశాలపై తెలకపల్లి రవి మనోభావాలు.. ఆయన మాటల్లోనే...

● డిటెక్టివ్ సాహిత్యంలో అగ్రగణ్యుడైన రచయిత షర్లాక్ హోమ్స్ స్ఫూర్తితో 1917లోనే కర్నూలులో ఉయ్యాలవాడ రామచంద్రరావు 'చతురిక' అనే నవల రాశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం గ్రంథాలయంలోని పుస్తకాల డిజిటల్ కాపీలు ఆన్‌లైన్‌లో తిరగేస్తుండగా ఇది కనిపించడం నిజంగా అనూహ్యమే. ఈ నవలకు సంబంధించిన విశేషాలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. 1917లో కర్నూలులోని చంద్రమౌళీశ్వర ముద్రాక్షరశాల అధినేత ఎస్‌వీ రాఘవయ్య ఈ ప్రచురణకు ప్రేరణగా నిలువడమే కాకుండా సంపాదకుడిగానూ వ్యవహరించారు. కర్నూలు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన నరహరి గోపాలకృష్ణ చెట్టి 1872లో వెలువరించిన 'శ్రీరంగరాజ చరిత్రము' మొదటి నవల కాగా, 1878లో కందుకూరి వీరేశలింగం ప్రచురించిన 'రాజశేఖర చరిత్ర' రెండో నవల. అయితే చతురిక నవల రాష్ట్ర సాహితీ స్రవంతి విశేష కానుకగా సేకరణ, కూర్పుతో ముద్రించాం. ఈ కోణంలో ప్రాంతీయ సంస్కృతి, ఇక్కడి పురాతన కట్టడాలు, చరిత్రకు సంబంధించిన అంశాలను లోతుగా అధ్యయనం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

**మా తండ్రి నర్సింహయ్య ప్రోత్సాహం...**

నాబాల్యం, చదువు ఇక్కడే కొనసాగింది. 1968-75 మధ్య నెహ్రూ మెమోరియల్ హైస్కూల్, ఉస్మానియా కళాశాలల్లో చదువుకున్నాను. అలాగే మాతండ్రి కమ్యూనిస్టు పోరాటయోధుడు తెలకపల్లి నరసింహయ్య సాహిత్యం బాగా చదివేవారు. ఆయన భర్తృహరి శుభాషితాలు చదివి చెప్పేవారు. వాటి అర్థాన్ని మాతో అధ్యయనం చేయించేవారు. సాహిత్యం విప్లవోద్యమానికి ఎలా అన్వయించుకుంటామో తెలిపేవారు. అలా 1970 దశకంలో శ్రీశ్రీ, దాశరథి, కరుణశ్రీ, గజ్జల మల్లారెడ్డి, రాజన్న కవి, గడియారం వారు వంటి మహామహులతో పరిచయం ఉండేది. మా ఇంటికి వారి రాకపోకల సందర్భంగా వారి మధ్య జరిగే చర్చలను వింటూ పెరిగాను. అలాగే 1974లో నేటి గడియారం ఆసుపత్రి వద్ద ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో, శ్రీనివాస క్లాత్ మార్కెట్ వద్ద ఉండే సాయి గ్రంథాలయంలో చాలా మంచి పుస్తకాలు అందుబాటులో ఉండేవి. అప్పట్లో తెలుగు సాహిత్యం ఇక్కడ బాగా ఆదరణ పొందింది. అనేక మంది అరసం, విరసం కవులు కర్నూలుకు వచ్చేవారు.



**విద్యార్థి దశ నుంచే సాహిత్యంపై ఆసక్తి...**

1973లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు జడ్పీ కార్యాలయ ఆవరణలో జరిగాయి. నేను కళాశాల స్థాయిలో ఎస్ఎఫ్ఐలో ఉంటూ రాసిన కవితే నాకు సాహిత్యంలో ప్రేరణను ఇచ్చింది. 'విద్యార్థీ...అర్థం కాలేదా పద్యం...తలకెక్కలేదా గద్యం' అనే కవిత రాసి వినిపించాను. అది ఎస్ఎఫ్ఐ పత్రికలో వేశారు. అలా ఆనాటి సాహిత్య సభలు, ప్రముఖుల పరిచయాలతో మంచి పుస్తకాలు చదవడం అలవాటైంది.

**సాహితీ స్రవంతి ద్వారా కార్యక్రమాలు..**

రాష్ట్ర వ్యాప్తంగా సాహితీ స్రవంతి ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. యోగి వేమన సామాజిక కోణంలో తెలిపిన అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి మంచి ఫలితం సాధించాం. అలాగే సామాజిక ఉద్యమకారుడు బసవేశ్వరుని జీవితం, ఆయన బోధనలు కూడా సమాజంలోనికి విస్తృతంగా తీసుకు వెళుతున్నాం. విద్యాలయాలు, వైద్యాలయాలు, గ్రంథాలయాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలి. పిల్లలకు ఇంగ్లీషు మీడియంతో పాటు తెలుగు భాష చక్కగా నేర్పించాలి.

## విధులు ముగించుకొని వెళ్తూ..

# రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

ఆళ్లగడ్డ/ చాగలమర్రి, మే 25(ఆంధ్రజ్యోతి):విధులు ముగించుకొని వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓకానిస్టేబుల్ దుర్మణం చెందాడు. ఈఘటన ఆళ్లగడ్డ సమీపంలో చోటు చేసుకున్నట్లు ఆళ్లగడ్డ పోలీసులు తెలిపారు. వివరాలు.. కోవెలకుంట్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు కానిస్టేబుల్‌గా శేఖర్(34) పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం విధులు ముగించుకొని మోటార్‌సైకిల్‌పై తిరిగివెళ్తున్నాడు. ఫోన్ రావడంతో బైక్‌ను పక్కకు ఆపారు. ఇంతలో వెనుక నుంచి పాల వాహనం ఢీకొట్టింది. దీంత కానిస్టేబుల్ శేకర్ తలకు బలమైన గాయమైంది. తీవ్ర రక్తస్రావం కావడంతో నంద్యాల ఉదయానంద ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. బైక్ నడుపుతున్న అనిరుధ్‌కు రక్తగాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా శేఖర్ కుటుంబానికి సానుభూతి తెలిపారు.



సాత్రీశేఖర్ (ఫైల్)

**గౌరవ వందనం..**

ఎస్పీ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్, సిబ్బంది మద్దూరు గ్రామానికి చేరుకొని శేఖర్ మృతదేహంపై పుష్పగుచ్చం ఉంచి గౌరవ వందనం చేశారు. గాలిలోకి మూడురౌండ్లు కాల్పులు జరిపి ఘన నివాళి అర్పించారు. అంతిమ యాత్రగా కానిస్టేబుల్ మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్య క్రియలు చేశారు. అనంతరం అంత్యక్రియల నిర్వహణకై ప్రభుత్వ సాయం కింద మంజూరైన రూ.25 వేలు డీఎస్పీ మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. శేఖర్ కుటుంబానికి పోలీస్ శాఖ తరుపున రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందించారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, చాగలమర్రి ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు**

**ఎమ్మెల్యే నివాళి**

రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమై మృతిచెందిన కానిస్టేబుల్ శేఖర్ మృతదేహానికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె శేఖర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబానికి అందాల్సినవని తనే దగ్గరుండి ఏర్పాటుచేస్తానని భరోసా ఇచ్చారు.

# యువకుడి బలవన్మరణం

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**

నంద్యాల టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): పెళ్లికావడంలేదని మన స్థాపంతో ఉరేసుకొని ఓయువకుడు బలవనర్మణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నంద్యాలలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. నంద్యాల మండలంలోని కొత్తపల్లెకు చెందిన రాముడు(29) రెండునెలల క్రితం శ్రీనివాస్‌నగర్‌లోని తృప్తి మెస్‌లో వంట మాస్టర్‌గా చేరాడు. అదే మెస్‌పైన ఓగదిని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. పెళ్లి కావడం లేదని తీవ్ర మన స్థాపం చెందాడు. రెండు రోజుల నుంచి గది నుంచి కిందకు రాలేదు. దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఆదివారం పోలీసులకు సమాచారమిచ్చారు. గదిని తెరిచి చూడడగా బాడీ ఉబ్బిపోయి దుర్వాసన వస్తుంది. పోలీసుల మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి సుజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



# మహానాడును విజయవంతం చేద్దాం

**టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి**

కర్నూలు అర్బన్, మే 25(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే మహానాడును విజయవంతం చేద్దామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పలువురు నాయకులకు మహానాడుకు హాజరు కావడానికి నాలుగు రకాల ఎంట్రీ పాసులను అందజేశారు. స్టేజీ పాసులు, వీవీఐపీ, వీఐపీ, వాహనాల పాసులను అందజేశారు. జిల్లాలోని నాయకులకు రాష్ట్ర కార్యాలయం పంపిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.



కార్పొరేటర్ పద్మలతకు ఎంట్రీ పాసులను అందిస్తున్న తిక్కారెడ్డి

# ఎన్టీఆర్ పురస్కారం అందుకున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, నందిఅవార్డు గ్రహిత, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య ఎన్టీఆర్ పురస్కారం అందుకున్నారు. ఆదివారం రాత్రి పల్నాడు జిల్లా సాతులూరులోని నటరత్న ఎన్టీఆర్ జాతీయస్థాయి నాటకోత్సవ వేడుకల్లో పత్తి ఓబులయ్యకు ఎన్టీఆర్ పురస్కారంను నరసరావుపేట ఎమ్మెల్యే చదవలవాడ అరవింద్‌బాబు అందజేశారు. కార్యక్రమంలో నడింపల్లి వెంకటేశ్వరరావు, బుర్ర నరసయ్య, చదలవాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి ఓబులయ్యకు ఎన్టీఆర్ పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

# రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమిద్దాం

**సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు ఎంఏ గఫూర్**

కర్నూలు న్యూసిటీ, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రజా వ్యతిరేక పాలకుల నుంచి రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలు చేద్దామని సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు ఎంఏ. గఫూర్ పిలుపునిచ్చారు. నగరంలోని కేకే భవన్‌లో ఆదివారం జరిగిన సీపీఎం జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్, మతతత్వ అజెండాతో ఉద్యోగులు, కూలీలపై ఆర్థిక పీడనను పెంచి అప్పులయ్యేలా చేసి కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల ఆదాయాన్ని పెంచుకునేలా చేసిందన్నారు. ఈ నేపథ్యంలో వర్గ, ప్రజా, సామాజిక పోరాటలను మరింత తీవ్రతరం చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, జి.రామకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు ఎంఏ గఫూర్

# తప్పిన పెను ప్రమాదం

- హైవే నుంచి కిందకు దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు
- పది మందికి స్వల్ప గాయాలు
- ఊపిరి పీల్చుకున్న మిగతా ప్రయాణికులు

నంద్యాల టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిద్రమత్తులో ఓ ప్రైవేటు బస్సు హైవే నుంచి కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటన నంద్యాల టోల్‌ప్లాజా వద్ద చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న శ్రీవారి ప్రైవేటు ట్రావెల్స్ ఏసీ బస్సు ఆదివారం తెల్లవారుజామున నంద్యాల టోల్‌ప్లాజా వద్ద కిందకు దూసుకెళ్లింది. డ్రైవర్ నిద్రమత్తులో కిందకు వెళ్లినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ బస్సులో సుమారుగా 40 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు కిందకు దిగడంతో 10 మందికి స్వల్పగాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. గాయపడ్డ వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. క్షతగాత్రులంతా హైదరాబాద్‌కు చెందినవారే. పెను ప్రమాదం తప్పడంతో మిగతా ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హైవే నుంచి కిందకు దూసుకెళ్లిన బస్సు

# సమసమాజం కోసం ఉద్యమాల్లోకి..

- 'కగార్'లో అమరురాలైన కామ్రేడ్ సంగీత
- పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లా బకాష్

కర్నూలు, మే 25 (ఆంధ్రజ్యోతి): దోపిడీ, పీడనలు లేని సమసమాజం కోసం మావో యిస్టు ఉద్యమంలోకి వెళ్లిన మావోయిస్టు కామ్రేడ్ లలిత అలియాస్ సంగీత ఆపరేషన్ కగార్‌లో భాగంగా సైనికులు జరిపిన దాడుల్లో అమరురాలైందని పౌర హక్కుల సం ఘం జిల్లా కార్యదర్శి అల్లా బకాష్ పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పరి మండలం ములుగుందం గ్రామంలో దళిత సామాజికవర్గానికి చెందిన దుబ్బన్న, ఏసైరమ్మ దం పతుల కుమార్తె లలిత. నర్సింగ్ చేసిన ఆమె ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్లిందని తెలిపారు. అక్కడ కుల నిర్మూలన పోరాట సమితిలో కీలకంగా మారి దళిత హక్కుల కోసం పనిచేసిందని వివరించారు. ఆక్రమంలోనే మావోయిస్టు ఉద్యమంతో పరిచ యాలు పెరిగి, పార్టీ కార్యకర్తగా అజ్ఞాతంలోకి వెళ్లిందన్నారు. 20 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేసిందని వివరించారు. ఇటీవలే అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లలిత అలియాస్ సంగీత మృతిచెందిందన్నారు. ఆమె మృతదేహం కోసం సోదరులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్‌కు వెళ్లారని, అక్కడి పోలీసులు మృతదేహం అప్పగిం చ లేదన్నారు. ఆమె మృతదేహం రాగానే అంత్యక్రియలు స్వగ్రామం ఆస్పరి మండలం ములుగుందంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌డీపీఐ నాయకులు జహంగీర్, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, విరసం బాధ్యులు నాగేశ్వర ఆచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లా బకాష్

# రైలు కింద పడి వ్యక్తి మృతి

డోన్ టౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఓవ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ బిందుమాధవి తెలిపారు. వివరాలు.. డోన్‌లోని రైల్వేస్టేషన్‌లో పట్టణంలో నెహ్రూనగర్‌కు చెందిన చంద్రమోహన్(42) అనే వ్యక్తి రైలు కింద పడి మృతిచెందాడు. మృతుడి వివరాలు సేకరించి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## మద్యం దుకాణం లైసెన్స్ రద్దు చేయాలి

**పాములపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి):** మండలకేంద్రంలోని పాములపాడులో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మద్యం దుకాణం లైసెన్స్ రద్దు చేయాలని సీపీఐ నాయకులు రమేశ్‌బాబు, కార్యదర్శి సుధాకర్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం మద్యం దుకాణం రహదారికి 200 మీటర్ల దూరంలో ఉండాల్సి ఉండగా, 50 మీటర్ల దూరంలో పెట్టారన్నారు. మందుబాబులకు బార్లను తలపించేలా మద్యం తాగేందుకు సౌకర్యాలు కల్పించారని, ధనార్జనే వ్యవహరిస్తున్నా, అధికారులు పట్టించుకోక పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

## భగవద్గీత ప్రచారం



పాములపాడులో భగవద్గీత ప్రచారం చేస్తున్న దృశ్యం

**పాములపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి):** త్రైత సిద్ధాంతం, హిందూ జ్ఞానవేదిక ఆత్మకూరు కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మునిదాస్ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంతం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఖర్మ యోగం, విశిష్టత, క్రిష్ణుడి అసలైన జ్ఞానం తెలుసుకోవాలనే ఉద్దేశంతో ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కుమార్, ఆచారి, పుల్లారెడ్డి, నాగమద్దిలేటి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో కురిసిన వర్షం



ఆత్మకూరులోని కేజీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

**ఆత్మకూరు, మే 25(ఆంధ్రజ్యోతి):** పట్టణంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం, సాయంత్రం వర్షం కురియడంతో రోడ్లపై నీరు నిలిచింది. వర్షం కురియడంతో రైతులు ఖరీఫ్‌కు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

## రైతు బజారును వినియోగంలోకి తీసుకురావాలి




రైతు బజారును సందర్శించిన సీపీఎం నాయకులు

**ఆత్మకూరు, మే 25(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద రూ.65లక్షలతో నిర్మించిన రైతు బజారును వినియోగంలోకి తీసుకురావాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్, రామ్‌నాయక్, వీరన్నలు డిమాండ్ చేశారు. ఆదివారం రైతు బజారును పరిశీలించారు. 2021 జూలై 8న ప్రారంభించినా నిర్వహణలేక మూతపడిందన్నారు. కూరగాయల రైతులకు ప్రోత్సహించి, నేరుగా తమ దిగుబడులను విక్రయించుకునే వ్యవహరించాలని కోరారు.

## కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు



కుక్కలను బంధించిన దృశ్యం

**ఆత్మకూరు, మే 25(ఆంధ్రజ్యోతి):** పట్టణంలో కుక్కల సంతతి నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల కుక్కల సంచారం అధికమై, ప్రజలపై దాడులు చేస్తుండటం తో రెండు రోజులుగా గుంటూరు జిల్లాకు చెందిన కుక్కలు పట్టే వ్యక్తులను పిలిపించి వాటిని బంధించి ప్రత్యేక వాహనంలో నంద్యాలకు తరలించారు. అక్కడ యాంటీ రేబీస్ వ్యాక్సిన్లతో పాటు, సంతాన నిరోధక శస్త్రచికిత్స చేయనున్నారు. అనంతరం వీటిని తిరిగి ఆత్మకూరు పట్టణంలో వదిలేలా మున్సిపల్ అధికారులు ప్రణాళిక రూపొందించారు.

## అదుపు తప్పిన బైక్.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**శ్రీశైలం (ఆత్మకూరు), మే 25(ఆంధ్రజ్యోతి):** శ్రీశైల క్షేత్ర పరిధిలో ఆదివారం బైక్ అదుపు తప్పి, డివైడర్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలానికి చెందిన వీరనారాయణ, కృష్ణ అనే బైక్‌పై శ్రీశైలానికి వెళ్తున్నారు. ముఖద్వారం నుంచి రెండో మలుపు వద్ద వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో 108లో వారిని సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై శ్రీశైలం వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వైభవంగా కల్యాణం



వైభవంగా గౌరీ మార్కండేయ స్వామి కల్యాణం

**ఆత్మకూరు, మే 25(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని గౌరీ మార్కండేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కల్యాణం నిర్వహించారు. ముందుగా మహా గణపతిపూజ, స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను అలంకరించి కళ్యాణ వేదికపై ఉంచి, కల్యాణం చేశారు. 26న ఆలయంలో లలితా సహస్రనామాలు, కుంకుమార్చనలు, మహా మంగళ హారతి ఉంటుందని, భక్తులకు అన్నదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

## రీవాల్యుయేషన్‌లో పెరిగిన మార్కులు

**గడివేముల, మే 25 (ఆంధ్రజ్యోతి):** పది పరీక్షా ఫలితాల్లో తక్కువ మార్కులు రావడంతో రీవాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థినికి 10 మార్కులు పెరిగాయి. మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి హైస్కూల్ కరస్పాండెంట్ రామేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు విద్యార్థిని శ్రీభారతి పదోతరగతి పరీక్షల్లో తక్కువ మార్కులు రావడంతో రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకుంది. దీంతో సైన్స్ సబ్జెక్టులో పది మార్కులు అదనంగా పెరిగాయి. 577 మార్కులతో మండలంలో ద్వితీయస్థానంలో నిలిచిన శ్రీభారతి 587 మార్కులతో ప్రథమ స్థానంలో దక్కించుకుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీభారతిని పాఠశాల కరస్పాండెంట్ రామేశ్వరరావు, ఏవో రాఘవేంద్రరావులు అభినందించారు.

# శంకుస్థాపనకే పరిమితం

**ప్రారంభం కాని నూతన భవన నిర్మాణ పనులు**
**అద్దె భవనంలో మున్సిపల్ కార్యాలయం**



పెద్దబజారులోని పాత మున్సిపల్ కార్యాలయం

**ఆత్మకూరు, మే 25(ఆంధ్రజ్యోతి):** మేజర్ గ్రామపంచాయతీ ఉన్న ఆత్మకూరును 2011లో గ్రేడ్-3 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం నూతన భవనం నిర్మించేందుకు 2013లో నాటి శ్రీశైలం ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి రూ.50లక్షల అంచనాతో పట్టణ శివార్లలోని దుద్యాల రస్తాలో నూతన మున్సిపల్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనతరం ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇది శిలాఫలకానికే పరిమితమైంది.

### అద్దె భవనంలోనే కార్యాలయం

సొంత భవనం లేకపోవడంతో మున్సిపల్ కార్యాలయాన్ని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. భవనం శిథిలావస్థలో ఉండటంతో పాటు ఇరుకు గదులు ఉండటంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

### స్థలం ఎంపికలోనే గందరగోళం

మున్సిపాలిటీ భవనం నిర్మించేందుకు స్థలం ఎంపికలో గందరగోళం ఉండటంతో నిధులు వెనక్కి వెళ్లకుండా ఉండేందుకు గాను దుద్యాల రస్తాలో మొక్కుబడిగా శంకుస్థాపన చేసినట్లు తెలుస్తోంది. పట్టణానికి దూరంగా కార్యాలయం నిర్మాణంపై ప్రజల నుంచి అభ్యంతరాలు రావడంతో పనులు వాయిదా పడ్డాయి. దీంతో అప్పటి నుంచి కొన్నేళ్లపాటు మున్సిపల్ కార్యాలయం ఎక్కడ నిర్మించాలో అన్న అంశంపై సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని శిథిలావస్థకు చేరుకున్న ఎస్సీ హాస్టల్ భవనాల స్థానంలో నిర్మించాలని భావించారు. అయితే సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌కు చెందిన భూములను మున్సిపాలిటీకి బదిలీ కాకపోవడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. చివరకు తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని మైనర్ ఇరిగేషన్ డిపార్టుమెంట్ స్థలాల్లో నిర్మించాలని ప్రతిపాదించారు. భూ బదలాంపు పూర్తయినా పనులు ప్రారంభం కాలేదు.



దుద్యాల రస్తాలో 2013 డిసెంబరు 31వ తేదీన మున్సిపల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన దృశ్యం



పాతబస్టాండ్ సమీపంలో స్పోర్ట్స్ అథారిటీ అద్దె గదుల్లో కొనసాగుతున్న మున్సిపల్ కార్యాలయం

### నిధుల కొరతే కారణమా..?

మున్సిపాలిటీ భవన నిర్మాణానికి మంజూరైన రూ.50లక్షల నిధులు చాలకపోవడంతో గత వైసీపీ హయంలో రూ.3కోట్లతో అంచనాలను రూపొందించి ప్రతిపాదనలు పంపించారు. టెండర్లు పిలిచినా వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించడానికి జాప్యం చేయడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని తెలిసింది. టీడీపీ ప్రభుత్వం ఉండటంతో మున్సిపాలిటీ భవన నిర్మాణంపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దృష్టి సారించారు. గత ప్రతిపాదనలతో పోల్చితే రూ.25లక్షలు అధికం కావడంతో రూ.3.25కోట్లతో డీపీఆర్‌ను తయారు చేయిస్తున్నారు. ఇది పూర్తికాగానే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి అనుమతులు రాగానే పనులను ప్రారంభించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

### రూ.3.25కోట్లతో డీపీఆర్



తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో 50సెంట్ల స్థలంలో మున్సిపల్ భవన నిర్మాణానికి రూ.3.25 కోట్లతో డీపీఆర్ తయారు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే టెండర్లను పిలిచి పనులను ప్రారంభిస్తాం. అద్దె భవనంలో కార్యాలయ నిర్వహణ ఇబ్బందిగా ఉన్నా, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాము.

\- రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్

# చారిత్రక వారసత్వ సంపదను కాపాడుదాం



శ్రీశైలం పాగాలంకరణ కార్యక్రమం నిర్వహిస్తున్న పృథ్వీ సుబ్బారావు, దుర్గ దంపతులను సన్మానిస్తున్న ఇంటాచ్ సభ్యులు

**నంద్యాల కల్చరల్, మే 25(ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వం, చారిత్రక వైభవాన్ని పరిరక్షించేందుకు అందరం కృషి చేయాల్సిన అవసరం ఉందని ఇంటాచ్ నంద్యాల జిల్లా చాప్టర్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డి, సంస్థ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చిన్నపురెడ్డి అన్నారు. ఆదివారం నంద్యాలలోని యోగా కాన్షస్‌నెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చాప్టర్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటాచ్ సంస్థ నంద్యాల జిల్లాలో చేపట్టిన మన ఊరు- మన గుడి మన బాధ్యత తరుపున పురాతన ఆలయాలు, కోనేరులను శుభ్రపరచడం, అతిథిదేవోభవ కార్యక్రమం ద్వారా శ్రీశైలం వచ్చే కర్ణాటక భక్తులను ఆదరించడం వంటి కార్యక్రమాలను చేపట్టామన్నారు. భవిష్యత్తులో హెరిటేజ్ వాక్ ద్వారా ప్రజలను జాగృతం చేస్తామన్నారు. చిన్నపరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం, మహానంది, అహోబిలం, ఓంకారం, యాగంటి లాంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలు గల నంద్యాల జిల్లాలో ఆధ్యాత్మిక వైభవాన్ని పెంపొందించి యాత్రికులు, సందర్శకులు పెరిగేలా ఇంటాచ్ సభ్యులు కృషి చేయాలన్నారు. ఇంటాచ్ సంస్థ ఆధర్యంలో ప్రత్యేకించి అహోబిలం పార్వేట ఉత్సవాలు, మహానంది కోనేటి నీటిపై పరిశోధన, శ్రీశైలం పాగాలంకరణ తదితర విషయాలలో చేసిన కృషిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేసి చూపించారు. కార్యక్రమంలో సంస్థ అడిషనల్ కోఆర్డినేటర్ సేతురామన్, రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ సుబ్బరామయ్య, నంద్యాల చాప్టర్ కన్వీనర్‌గా కటకం రఘువీర్, శ్రీశైలం పాగాలంకరణ నిర్వహిస్తున్న పృథ్వి సుబ్బారావు, దుర్గ, న్యాచురోపతి డాక్టర్ రామక్రిష్ణారెడ్డి, డాక్టర్ గెలివి సహదేవుడు, డాక్టర్ కిషోర్‌కుమార్, అన్నెం శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సీహెచ్‌వోల సమ్మె విరమణ

**● సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ**

**నంద్యాల హాస్పిటల్, మే 25 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర వ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం విరమించారు. రాష్ట్ర నాయకులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో చర్చించిన మేరకు సమ్మెను విరమించినట్లు ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ తెలిపారు. సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరిస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సమస్యల పోరాటానికి 27రోజుల నుంచి సీహెచ్‌ఓలు సమ్మె చేస్తున్నారన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సమ్మెను విరమింపజేసి విధులకు హాజరుకావాలని కోరిన మేరకు సమ్మె విరమించామన్నారు. సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సౌందర్య, ఉపాధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి గురుప్రసాద్, చక్రధర్, హారిక, అఖిల్, బాబు పాల్గొన్నారు.

## మహానాడును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వైవీ సుబ్బారావు

**బండి ఆత్మకూరు మే25 (ఆంధ్రజ్యోతి):** కడపలో నిర్వహించనున్న టీడీపీ మహానాడును విజయవంతం చేయాలని శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకులు వైవీ సుబ్బారావు అన్నారు. ఆదివారం సాయంత్రం బండిఆత్మకూరు పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి 5వేల మందికి తగ్గకుండా తరలించాలన్నారు. గత వైసీపీ దుర్మార్గ పాలన నుంచి రాష్ట్రం బయట పడి టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం భారీగా జరుగుతున్న ఈ ఉత్సవాలకు ప్రజలు , కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు నాగ కృష్ణారెడ్డి, జాకీర్, నందయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి



మానవహారంలో పాల్గొన్న ముస్లిం జేఏసీ నాయకులు

**నంద్యాల రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి):** వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ముస్లిం కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాలలో మానవహారం నిర్వహించారు. ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మౌలానా అబ్దుల్ రషాది మాట్లాడుతూ ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్రం కాలరాస్తుందన్నారు. ముస్లిం హక్కులను కాలరాయడం రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. వక్ఫ్ సవరణ చేయాలంటే ఆల్ ఇండియా లా బోర్డుతో చర్చించాలన్నారు. ముస్లిం ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ గౌరవఅధ్యక్షుడు అబులైస్, మౌలానా అంజాద్ బాషా సిద్ధిఖి, మస్తాన్, బాబాపక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం సాగిస్తామని ఆత్మకూరు వక్ఫ్ పరిరక్షణ జేఏసీ ప్రతినిధులు ముఫ్తి నూర్‌మహ్మద్, మౌలానా రహంతుల్లా, మోలానా జబివుల్లా, ముఫ్తి అల్తాఫ్ హుసేన్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆత్మకూరులోని నంద్యాల కేజీ రోడ్డుకి ఇరువైపుల నల్లబ్యాడ్జీల ధరించి నల్ల జెండాలతో చేతబూని నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ.. రాజ్యాంగానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం సరికాదని ఎద్దేవా చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25, 26, 300ఏకు విరుద్ధంగా కేంద్రం ఇలాంటి చట్టసవరణకు పాల్పడటం అన్యాయమని అన్నారు. ఇలాంటి నల్ల చట్టాలను కేంద్రం వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటాలు సాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## విద్యార్థి ఆత్మహత్య

**గడివేముల, మే 25 (ఆంధ్రజ్యోతి):** ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో తక్కువ మార్కులు వచ్చాయని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గడివేముల మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెసరవాయి గ్రామానికి చెందిన విద్యార్థి రాజేష్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో తక్కువ మార్కులు వచ్చాయని ఆందోళన చెందేవాడు. ఇంటిలో ఎవరు లేని సమయంలో మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి జీవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## 28 నుంచి మహా కుంభాభిషేక ఉత్సవాలు



స్వర్ణోత్సవ మహాకుంభాభిషేక ఉత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

**నంద్యాల కల్చరల్, మే 25(ఆంధ్రజ్యోతి):** నంద్యాల సంజీవనగర్‌లో వెలసిన కోదండరామాలయం, కాశీవిశ్వేశ్వరస్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాల ప్రాంగణంలో 50వ ఆలయ స్వర్ణోత్సవ మహా కుంభాభిషేక ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు భగవత్‌సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధీశ్వరులు జగద్గురు శ్రీవిద్యాశంకర భారతీమహాస్వామి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 28న దీపారాధన, గోపూజ, సాయంత్రం హోమాలు, 29న హోమాలు, 30న పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీస్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ పూజలు, జగద్గురువుల ఆధ్వర్యంలో కుంభాభిషేకములు, హోమాలు తదితర కార్యక్రమాల నిర్వహించుటకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో భగవత్ సేవాసమాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



కార్యకర్తలకు ఐడీ కార్డులను పంపిణీ చేస్తున్న జనసేన మండల నాయకులు

**గడివేముల, మే 25 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జనసేన మండల నాయకులు ధరణి చంద్రమోహన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జనసేన కార్యాలయంలో క్రియాశీల కార్యకర్తలతో సమావేశమయ్యారు. వారికి ఐడీ కార్డులను, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అందించిన ప్రశంసా పత్రాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేసిందని అన్నారు. పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. జనసేన కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. పాణ్యం నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు చింతా సురేష్‌బాబు కార్యకర్తలకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రఫీ, సూర్యనారాయణరెడ్డి, ఫరూక్, సురేష్‌బాబు, సుధాకర్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

**కొత్తపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి):** స్థానిక సరస్వతీ విద్యామందిర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 2001 నుంచి 2020 వరకు పాఠశాలలో చదివిన విద్యార్థులు కలుసుకున్నారు. కరస్పాండెంట్ మల్లయ్యతో కలిసి పాఠశాల నుంచి బస్టాండు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. తమ ఉపాధ్యాయుడు మల్లయ్యను గుర్తు చేసుకున్నారు. పాఠశాల పూర్వ వైభవానికి సహకార అందిస్తామని తెలిపారు. కరస్పాండెంట్ మల్లయ్య మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం ప్రారంభమైన పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఎక్కడెక్కడో స్థిరపడి నేడు పాఠశాలను గుర్తుపెట్టుకుని నేడు రావడం ఆనందదాయకమన్నారు. కరస్పాండెంట్ మల్లయ్యతో పాటు పూర్వ ఉపాధ్యాయులు లాలన్న, నాగన్న, రఘురాం, నీలకంటం, రమణారెడ్డి, వేణుగోపాల్, హుశేన్ బాషా, శశాంక్, సుజాత, లక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాగేశ్వరరావు, రాయుడు, కిషోర్, శివశంకర్ రెడ్డి, రాముడు, రవిశంకర్, మురళి, నాగిరెడ్డి, శ్యామల, రమేష్ కుమార్ పాల్గొన్నారు.

## వేలంపాటను అడ్డుకుంటాం

**● సీపీఎం, సీపీఐ నాయకులు**



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

**నందికొట్కూరు, మే 25 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కొణిదేల గ్రామంలో దేవదాయశాఖ అధికారులు ఈనెల 27న నిర్వహించనున్న వేలంపాటను అడ్డుకుంటామని సీపీఎం, సీపీఐ నాయకులు ఆదివారం హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు, సీపీఐ కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన బెస్త మల్లేశ్వరమ్మ, గువ్వల లక్ష్మీదేవి 2018 డిసెంబరు 26న సర్వే నెం: 343-1 లో 6.18ఎకరాలను వేలంలో రూ.20 లక్షలకు దక్కించుకున్నారన్నారు. భూమి చదునుకు అనుకూలంగా లేకపోవడంతో మరో రూ.20 లక్షలు ఖర్చుపెట్టి మట్టితోలి చదును చేసుకుని 7సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నానని, ఇప్పుడు తిరిగి అదే భూమిని దేవదాయశాఖ అధికారులు ఎలా వేలం వేయడానికి వస్తారని ప్రశ్నించారు. గతంలో కొనుగోలు చేసిన రైతులకు సీపీఎం, సీపీఐ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొంగర వెంకటేశ్వర్లు, దిలీప్, సంపంగి వెంకటేశ్వర్లు, రంగమ్మ, జయరాణి, ఉషేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు

**నందికొట్కూరు, మే 25 (ఆంధ్రజ్యోతి):** భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, నిధులు ఇవ్వాలని చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం రాజా వీధిలో భవన నిర్మాణ కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులకు కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికలలో ఎచంద్రబాబు ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. గతంలో కార్మికుల పిల్లలకు ప్రభుత్వం సహకరించేదని, ప్రమాద బీమా వచ్చేదన్నారు. ఇప్పుడు ఆ పథకాలు అమలు కావడం లేదన్నారు. వేల్పుల ఏసన్న, భావన, కార్మికులు కూలీలు, డ్రైవర్ వడ్డె శివ, షేక్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు

**కొలిమిగుండ్ల, మే 25 (ఆంధ్రజ్యోతి):** రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన కొలిమిగుండ్ల సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. కొలిమిగుండ్ల నుంచి రామ్‌కో సిమెంట్ పరిశ్రమలోకి బీహార్ కూలీలతో వెళ్తున్న ఆటో లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో మోటార్‌సైకిల్‌పై వస్తున్న నందిపాడు గ్రామస్థులు లోకనాథరెడ్డి, రామగోవిందు తీవ్రంగా గాయపడ్డారు. మరో వైపు ఆటో బోల్తా పడటంతో డ్రైవర్‌తో పాటు మరికొంత మంది కూలీ లు గాయపడ్డారు.

## కార్యకర్తలే పార్టీకి కీలకం


గొడిగనూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

చాగలమఱ్రి, మే 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే కీలకమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఆదివారం మండలంలోని గొడిగనూరులో పెద్దమ్మతల్లి జాతరలో పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు శేఖర్‌రెడ్డి నివాసంలో ఆమె మాట్లాడుతూ కడపలో జరిగే మహానాడును విజయవంతం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని అన్నారు. మహానాడును విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని, ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నరసింహరెడ్డి, టీడీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, సూర్యనారాయణ, రామసుబ్బయ్య, నరసింహ, బ్రహ్మానందరెడ్డి, నరేంద్రారెడ్డి, నర్సిరెడ్డి, ప్రమోద్‌కుమార్, రమేష్, రామచంద్రారెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

### సుబ్బరాయుడు మృతి బాధాకరం

పెద్దబోధనం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుబ్బరాయుడు అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## కల్యాణ మండప నిర్మాణానికి విరాళం

రుద్రవరం, మే 25 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం గ్రామానికి చెందిన కాణాల ఈడిగ నరసింహులు లక్ష్మీనరసమ్మ దంపతులు వాసాపురం వేంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో కల్యాణ మండపం నిర్మాణం చేపట్టేందుకు 2.50 ఎకరాలు భూమి విరాళం ఇచ్చినట్లు ఆదివారం తెలిపారు. దేవాలయం సమీపంలో కల్యాణ మండపం నిర్మించడం తరతరాలకు కలిసివస్తుందని అన్నారు. కల్యాణ మండప నిర్మాణ పనులు దేవాలయం తరపున ప్రారంభించినట్లు వారు తెలిపారు.

### నందవరం ఆలయాభివృద్ధికి..

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి నందవరానికి చెందిన తూర్పునాటి అశోక్ కుటుంబ సభ్యులు ఆదివారం రూ.25వేలు విరాళం అందించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పూజారులకు విరాళం అందించారు.

## 5న జాబ్‌మేళా


కరపత్రాన్ని విడుదల చేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేజీఆర్ కళాశాలలో వచ్చేనెల 5న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ తెలిపారు. ఆదివారం కరపత్రాలను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ మొత్తం 15 కంపెనీలు జాబ్‌మేళా కార్యక్రమంలో పాల్గొనున్నట్లు తెలిపారు. పదోతరగతి, ఐటీఐ, ఇంటర్, పాలిటెక్నిక్, ఇంటర్, డిగ్రీ బీటెక్, బీఫార్మసీ , డిఫార్మసీ అభ్యర్థులు అర్హులన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వివరాలను 8688651650 , 9705998056 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## ఘనంగా ఉమామహేశ్వరస్వామి కల్యాణం

బనగానపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా కల్యాణ వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈవో చంద్రుడు, మౌళీశ్వరుడు, ప్రధాన అర్చకులు మహేశ్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు

రుద్రవరం, మే 25 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం సమీపంలోని దొర్నిలక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ప్రతిష్ఠ అనంతరం ఆదివారం 41 రోజులు పండుగ ఘనంగా నిర్వహించారు. అర్చకులు శేష ఫణిశర్మ, విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమం, సుదర్శనహోమం, నరసింహస్వామి హోమం, సుబ్రహ్మణ్యస్వామి, లక్ష్మీదేవి హోమం చేపట్టారు. స్వామివారికి అభిషేక పూజలు చేశారు. కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

## నేడు ఆలయాల భూములకు కౌలు వేలం

శిరివెళ్ల, మే 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు గ్రూపు దేవాలయాల పరిధిలోని వివిధ ఆలయాలకు చెందిన భూములకు సోమవారం బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి రామాంజనేయ శర్మ ఆదివారం తెలిపారు. గుండంపాడులోని వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 63.01 ఎకరాల భూములకు ఉదయం 10.30 గంటలకు, శిరివెళ్లలోని ఓంకారేశ్వర స్వామి ఆలయానికి చెందిన 51.30 ఎకరాల భూములకు సాయంత్రం 5 గంటలకు కౌలువేలం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వేలంలో పాల్గొనదలచిన వ్యక్తులు రూ.2 వేలు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## అర్చకుడికి ఆర్థిక సాయం

రుద్రవరం, మే 25 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం గ్రామానికి చెందిన అర్చకుడు విశ్వనాథశర్మకు ఆదివారం బలిజ సంఘం తరపున రూ.లక్షా 10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ నెల 2న అర్చకుడి ఇంటిలో అగ్నిప్రమాదం జరిగిన విషయం విధితమే. నాయకులు ఎల్‌వీ రంగనాయకులు, పోలా గురుమూర్తి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు పుల్లయ్య, ఓబులయ్య, బాలనరసింహుడు, దస్తగిరి పాల్గొన్నారు.

## తహసీల్దార్ బాలఈశ్వరరెడ్డి బదిలీ

కొలిమిగుండ్ల, మే 25 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డిని బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. కొలిమిగుండ్ల నుంచి అమరావతి సీసీఎల్ విభాగానికి బదిలీ అయ్యారు. డీటీ విశ్వతేజ, ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించనున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు

కొలిమిగుండ్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన కొలిమిగుండ్ల సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. కొలిమిగుండ్ల నుంచి రామ్‌కో సిమెంట్ పరిశ్రమలోకి బీహార్ కూలీలతో వెళ్తున్న ఆటో లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో మోటార్‌సైకిల్‌పై వస్తున్న నందిపాడు గ్రామస్థులు లోక్‌నాథరెడ్డి, రామగోవిందు తీవ్రంగా గాయపడ్డారు. మరోవైపు ఆటో బోల్తా పడటంతో డ్రైవర్‌తో పాటు మరికొంత మంది కూలీలు గాయపడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108 వాహనంలో క్షతగాత్రులను చికిత్సకోసం ఆసుపత్రికి తరలించారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన

సంజామల, మే 25(ఆంధ్రజ్యోతి): మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజావైద్యశాలలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నంద్యాల, కర్నూలు పట్టణాలకు చెందిన వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురురాఘవేంద్ర గురురాజా విద్యా సంస్థల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి, విద్యాసంస్థల సిబ్బంది , కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల రోగులు పాల్గొన్నారు.

# సమస్యల్లో పీహెచ్‌సీ

- వేధిస్తున్న వైద్యుల కొరత
- సొంత భవనం లేక అవస్థలు
- పంచాయతీ కార్యాలయంలో నిర్వహణ
- పట్టించుకోని పాలకులు, అధికారులు


శిథిలావస్థలో ఆరోగ్య ఉపకేంద్రం

చాగలమఱ్రి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ముత్యాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. గ్రామానికి పీహెచ్‌సీని కేటాయించి రెండేళ్ల పూర్తయినా నేటికీ భవన నిర్మాణం జరగలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ముత్యాల పాడుకు పీహెచ్‌సీని కేటాయించి వైద్యులను నియమించారు. అరకొరగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. సొంత భవనం లేకపోవడంతో పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. సాధారణంగా ఆసుపత్రిని ఏర్పాటుచేస్తే 14మంది సిబ్బందిని కేటాయించాలి. గత ప్రభుత్వం ఆర్భాటంగా ఆసుపత్రిని కేటాయిస్తున్నట్లు చెప్పి కేవలం ఇద్దరు వైద్యులు, ఒక సూపర్ వైజర్‌ను మాత్రమే నియమించింది. ముత్యాలపాడు పరిధిలోకి వచ్చే ఏడుసచివాలయాల్లో ఎఫ్‌డీపీలో పాల్గొనేందుకు 20రోజులు కేటాయిస్తున్నారు. ఉన్న 10 రోజులు స్థానికంగా విధులు నిర్వహిస్తున్నారు.

### రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తున్న..

ఇద్దరు వైద్యులు లేకపోవడంతో ఆరోగ్య విస్తరణాధికారులు, వైద్యసిబ్బంది కలిసి రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్నారు. రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తున్న వైద్యులు సుల్తానా మెటర్నిటీ లీవ్‌పై వెళ్లగా, మరో వైద్యులు శివ మోహన్ రుద్రవరం వైద్యశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో గ్రామంలో ప్రజలు వైద్య సేవలు అందక అవస్థలు పడుతున్నారు. చాగలమఱ్రి ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు ఇమ్రాన్‌ను ముత్యాలపాడుకు ఇన్ చార్జి వైద్యాధికారిగా డిప్యూటేషన్‌పై నియమించారు. ప్రస్తుతం ఆయన కూడా సెలవుపై వెళ్లారు. దీంతో రెగ్యులర్ వైద్యులు లేక వైద్య సిబ్బందే వైద్యపరీక్షలు చేస్తున్నారు. గ్రామంలో బీపీ, షుగర్‌తో పాటు పక్షవాత కేసులు అధికంగా ఉండటంతో వైద్య సేవలు సక్రమంగా అందకపోవడంతో వివిధ ప్రాంతా లకు వెళ్లి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిం చాల్సిన పరిస్థితి నెలకొంది. పాలకులు, అధికారులు స్పందించి రెగ్యులర్ వైద్యులను నియమించి వైద్య సేవలు అందేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ముత్యాలపాడు పంచాయతీ కార్యాలయంలో వైద్య చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

### 11 వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి

రెగ్యులర్ వైద్యాధికారులు లేకపోవడం వాస్తవమే. ఇద్దరు వైద్యుల్లో వైద్యులు సుల్తానా మెటర్నిటీ లీవ్‌పై వెళ్లారు. శివ మోహన్ రుద్రవరం వైద్యశాలకు డిప్యూటేషన్‌లో ఉన్నారు. 11వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్యులు లేకపోవడంతో తామే వైద్యసేవలు అందిస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, ఆరోగ్య విస్తరణాధికారి, ముత్యాలపాడు

# భక్తుల కోసం వాటర్ ప్లాంట్లు

- ప్రారంభించిన మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రార్థనా మందిరాలకు వచ్చే భక్తుల దాహార్తి తీర్చడం కోసం కూలింగ్ మినరల్ వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. పట్టణంలోని దొరకోట మసీదు, బీసీ కాలనీలోని మాసూమ్‌బాషా ఖాద్రి మసీదుల్లో సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని 48 పెద్ద, చిన్న ప్రార్థనా మందిరాలు ఉన్నాయన్నారు. ఆయా ప్రార్థనా మందిరాలకు చెందిన కొందరు పెద్దలు తనను సంప్రదించి తాగునీటికి ఇబ్బందిగా ఉందని, మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని కోరారన్నారు. వారి విజ్ఞప్తి మేరకు తన తల్లిదండ్రులు బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం రెండు మసీదుల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. మినరల్‌వాటర్‌ప్లాంట్లు కావాల్సిన ప్రార్థనా మందిరాలకు వరుస క్రమంలో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామన్నారు. బనగానపల్లె పట్టణం లోని అన్ని మసీదులు, దేవాలయాలు, చర్చిలకు మాత్రమే ఈ సదుపాయం సొంత ఖర్చులతో కల్పించనున్నట్లు తెలిపారు. 100 నుంచి 1500 లీటర్ల కెపాసిటీ గల క్వాలిటీ వాటర్ ప్లాంట్లతో పాటు 80 లీటర్ల కెపాసిటీగల బ్లూస్టార్ కంపెనీ చెందిన కూలింగ్ మిషన్‌లు ఏర్పాటు చేయిస్తానన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహణ, బాధ్యత ఆయా ప్రార్థనా మందిరాల వారే చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముస్లింలు, ప్రజలు పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీ



ఆళ్లగడ్డలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సంఘాల నాయకులు

ఆళ్లగడ్డ, మే 25(ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పట్టణంలో ఆదివారం ముస్లింలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు ఆళ్లగడ్డలో ముస్లింలు నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా నాలుగు రోడ్ల కూడలి, ఆర్టీసీ బస్టాండ్ వరకు జాతీయ పతాకాలతో పాటు నల్ల జెండాలను ధరించి నిరసన చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని కోరుతూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జామియా మర్కస్ పాత మసీదు ఇమామ్, మండల ప్రభుత్వ ఖాజీ జాఫర్ మహమ్మద్ సాధిక్, వివిధ ప్రాంతాల ముస్లింలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# గిరిజనుల ఉత్పత్తులను కొనుగోలు చేయాలి

- ఏపీజీసీసీ చైర్మన్‌ను కోరిన డైరెక్టర్ అరుణ్‌కుమార్‌నాయక్


శ్రావణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అరుణ్‌కుమార్‌నాయక్

అవుకు, మే 25 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఏపీ గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) డైరెక్టర్ అరుణ్‌కుమార్‌నాయక్ కోరారు. ఆదివారం కర్నూలుకు మొదటి సారి వచ్చిన ఏపీ జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌ను అవుకు పట్టణానికి చెందిన జీసీసీ డైరెక్టర్ అరుణ్‌కుమార్‌నాయక్, టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణనాయక్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. అరుణ్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ గిరిజనులు పండిస్తున్న 43 రకాల పంటల ఉత్పత్తులను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి గిరిజనులు పండిస్తున్న ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


యర్రగుంట్లలో గురువులకు పూలతో స్వాగతం పలుకున్న పూర్వ విద్యార్థులు


బేతంచెర్లలో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

శిరివెళ్ల, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. 20ఏళ్ల తరువాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎంలు దత్తన్న, జగన్‌మోహన్‌రెడ్డి, జ్యోతి, పూర్వ విద్యార్థుల బృందం ప్రతినిధులు శిరిగిరి నరసింహారెడ్డి, రామాంజనేయులు, రామిరెడ్డి, పావని, ఓబులేసు, రమేష్ ఆచారి, అస్లాం బాషా, నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

### బేతంచెర్లలోని సరస్వతి శిశుమందిర్‌లో..

బేతంచెర్ల: పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 2004-05 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. గురువులు తిరుమలేష్‌గౌడు, రామ మద్దిలేటి, సుబ్రహ్మేణ్యేశ్వర శర్మ, జక్రియ, సుజాత, అలివేలులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నిరంజన్ అరుణ్, సునీల్, విజయ్, మధు లోకేశ్వర రెడ్డి, సుజిత్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నందివర్గం ఉన్నతపాఠశాలలో..

బనగానపల్లె: మండలంలోని నందివర్గం ఉన్నతపాఠశాలలో ఆదివారం 2004-05 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 20ఏళ్ల తర్వాత మిత్రులంతా ఒకచోట చేసి తమ పూర్వ జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. పూర్వపు హెచ్ఎం పక్కీర్‌రెడ్డి, కుమార్ బాబు, సావిత్రమ్మ, సుబ్బారెడ్డి, సింగోటం కృష్ణమూర్తి, సుబ్బయ్య, రేణుకాదేవి సహా మొత్తం 10 మంది పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు నరేంద్రయాదవ్, నరేంద్ర, అశోక్‌రెడ్డి, దినేశ్‌కుమార్, మాధవ, దీపిక, సంపంగి లక్ష్మి, శైలజ, జయ భారతి, శ్రీనివాసరెడ్డి, శవరాముడు, కరీంఫరూక్ పాల్గొన్నారు. పాఠశాల వద్ద బస్‌షెల్టర్ నిర్మాణం కోసం రూ.1.50లక్షలు విరాళంగా అందజేశారు.

### ఏనుగమర్రి ప్రభుత్వ ఉన్నత..

ప్యాపిలి: మండలంలోని ఏనుగమర్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-03 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో సమావేశమయ్యారు. బెంగుళూరు, హైదారాబాద్ వివిధ ప్రాంతాల్లో, ఆయా వృత్తులలో స్థిరపడిన దాదాపు 50 మంది పైగా పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. దాదాపు 22 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఆనంద బాష్పాలు రాల్చారు. గురువులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విఘ్నేశ్వరరెడ్డి, శివశంకర వరప్రసాద్, సురేంద్రగౌడు, మధు, రజాక్ పాల్గొన్నారు.

## వైభవంగా విష్ణు సహస్ర నామ పారాయణం


విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తున్న మహిళలు

చాగలమఱ్రి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గమల్లేశ్వర, పాత శివాలయంలో మాసశివరాత్రి సందర్భంగా ఆదివారం మహిళలు సామూహికంగా విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బుగ్గమల్లేశ్వర ఆలయంలో ఈశ్వరుడికి కమిటీ సభ్యులు జల, క్షీరాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు వినోద్‌కుమార్, శివప్ర సాద్, నవతాప్రసాద్, శ్రీనివాసులు, సుగుణాకర్, పుల్లయ్య, మహి ళలు పాల్గొన్నారు.

## నిందితుడిని కఠినంగా శిక్షించాలి

చాగలమఱ్రి, మే 25 (ఆంధ్రజ్యోతి): చిన్నారిని హత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీజేపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ కన్వీనర్ బోరెడ్డి లక్ష్మీరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల చిన్నారిని హత్యాచారం చేయడం హేయమైన చర్య అన్నారు. ఇటువంటి సంఘటనలు జరుగకుండా ప్రభుత్వం, పోలీసు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. నిందితుడిని ఎన్‌కౌంటర్ చేస్తే మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు.

## 'మహిళలు, చిన్నారులకు భద్రత కరువు'

చాగలమఱ్రి, మే 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలు, చిన్నారులకు భద్రత కరువైందని ఆళ్లగడ్డ వైసీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి ఆరోపించారు. అత్యాచారానికి గురై హత్యకు గురైన చిన్నారి కుటుంబీకులను ఆదివారం ఆయన పరామర్శించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మట్టి నమూనాల సేకరణ: ఏవో


ఏవో భూమా జ్యోతి

కొలిమిగుండ్ల, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 470 మంది రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించినట్లు వ్యవసాయాధికారి భూమా జ్యోతి తెలిపారు. ఆదివారం ఏవో మాట్లాడుతూ మండలంలో 540 మట్టి శాంపుల్స్ సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటివరకు 470 మట్టి నమూనాలను సేకరించామన్నారు. త్వరితగతిన మట్టి నమూనాల సేకరణ పూర్తి చేస్తామన్నారు. భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా రైతులు పంటలు సాగు చేస్తే ఎంతో మేలు చేకూరుతుందని సూచించారు. ఎంత మోతాదులో ఎరువులు వినియోగించాలి, ఏపంటలు సాగు చేయాలి అన్న విషయాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు ఏవో వెల్లడించారు.

## మహానాడుకు తరలిరండి

కొలిమిగుండ్ల, మే 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలంటూ టీడీపీ మండల అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వారు మాట్లాడుతూ కడప కేంద్రంగా నిర్వహిస్తున్నందున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి, బనగానపల్లె నియోజకవర్గం సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంబటి జయలక్ష్మీరెడ్డి, కామిని క్రిష్టరంగారెడ్డి, అంబటి వివేకానందరెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, తోటశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరిహారం చెల్లించకపోతే ఉద్యమిస్తాం

ప్యాపిలి, మే 25 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని గొల్ల పల్లి బుగ్గ ప్రాంతంలో సో లార్ ప్రాజెక్టులో భూములను కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం చెల్లించక పోతే ఉద్యమిస్తామని అవాజ్ కమిటీ , సీపీఐ నాయకులు జలదుర్గం రసూల్, చిన్నరహిమాన్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని జలదుర్గం గ్రామంలో వారు రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లుగా రైతులు గొల్లపల్లి బుగ్గ ప్రాంతంలో భూములను సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే సోలార్ ప్రాజెక్టులో భూములను కాజేసేందుకు సిద్ధపడుతున్నారని ఆరోపించారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు ఏటా రూ.40వేలు కౌలు గాని లేదా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ, ఆవాజ్ కమిటీ కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం

బేతంచెర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాపేటలో వెలసిన వేంకటేశ్వరస్వామి 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా వేదపండితులు నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం, ఉత్సవమూర్తులకు సంప్రోక్షణ నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు మద్దయ్య దంపతులు, కుటుంబ సభ్యులు, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రబాబు, ఈశ్వర్ రెడ్డి, నాగమోహన్ భక్తులు పాల్గొన్నారు.

## వెంకటయ్య అడుగుజాడల్లో నడవాలి

బేతంచెర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో లారీ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకుడు వెంకటయ్య అడుగుజాడల్లో ప్రతి కార్మికుడు నడవాలని సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, సాధిక్ హుశేన్, వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో వెంకటయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి, డ్రైవర్‌కాలనీలో ఉండే స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, వైబీ వెంకటేశ్వర్లు, రామాంజనేయులు మద్దిలేటి స్వామి, హరిప్రసాద్, బాలకృష్ణ, రామచంద్రుడు, డి.రాజు, శ్రీను, మధు పాల్గొన్నారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలి

బనగానపల్లె, మే 25 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించి పెట్టుబడులు తగ్గించుకోవాలని మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మిట్టపల్లెలో సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ విజయభాస్కర్, యూనిట్ ఇన్‌చార్జి లక్ష్మిచరిత అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం తొమ్మిది సూత్రాలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ఆదినారాయణ, డిజిటల్ లక్ష్మి, రమేశ్‌రెడ్డి, ఉపసర్పంచ్ హైమావతి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## మద్యం దుకాణంలో చోరీ

బేతంచెర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని రమ్య వైన్‌షాప్‌లో చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు రూ.3.99లక్షల నగదును అపహరించినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలు.. ఆదివారం తెల్లవారు జామున రమ్య వైన్‌షాపు వెనుక భాగంలో రంధ్రం చేసి దొంగలు షాపులోకి ప్రవేశించి నగదును అపహరించారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.